ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
30-07-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 331 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి

## భారత్ పతాకాల్లో బోణి



✍ **జయభేరి, పారిస్, జూలై 29:**

విశ్వ క్రీడల్లో భారత్ పతకాల బోణి కొట్టింది. తొలిరోజు నిరాశే ఎదురైనా, పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రోజు భారత్ కు తొలి పతకం లభించింది. షూటింగ్‌లో మను బాకర్ భారత్‌కు తొలి పతకం అందించింది. 10మీ.ఎయిర్ పిస్టల్ మహిళల ఫైనల్ లో కాంస్యం సాధించింది. తొలి పతకంతో త్రివర్ణ పతకాం రెపరెపలాడించింది. షూటింగ్ లో భారత్ కు మెడల్ సాధించిన తొలి మహిళా షూటర్ గా చరిత్ర లిఖించింది.దక్షిణ కొరియాకు చెందిన ఓ యే

...మిగతాది 2 లో

# రేపే రైతులకు రెండో విడత రుణమాఫీ



✍ **జయభేరి, హైదరాబాద్, జులై 29:**

రాష్ట్రంలోని రైతులకు రేపు రెండో విడత రుణమాఫీ చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇటీవల రూ.1 లక్ష లోపు రుణం ఉన్న వారికి మాఫీ అయ్యాయి. రెండో విడతలో లక్షన్నర రుణమాఫీ కానుంది. దీంతో ఆరు లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రెండో విడత కోసం ప్రభుత్వానికి రూ.7 వేల కోట్లు అవసరమని అధికారులు తెలిపారు. రెండో విడత రుణమాఫీ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, మూడో విడత రుణమాఫీ ఆగస్ట్ 14వ తేదీ తర్వాత జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్ట్ 2 నుంచి 14వ తేదీ వరకు విదేశీ పర్యటనలో ఉంటారు. ఆయన తిరిగి రాష్ట్రానికి వచ్చాక రూ.2 లక్షల రుణమాఫీ ఉండనుంది. మొదటి విడతలో భాగంగా రూ.1 లక్ష లోపు రుణాలను మాఫీ చేసింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇందుకోసం రూ.6,093 కోట్లు బ్యాంకులకు చెల్లించింది. మూడు దశల్లో చేయనున్న రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు ఖర్చవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది.



# అసెంబ్లీలో విద్యుత్ మంటలు


**సీఎం రేవంత్ రెడ్డి పవర్ పై చర్చ..**
**విద్యుత్ పై పవర్ ఫుల్ స్పీచ్**
**విద్యుత్ పై విచారణ కమిషన్**

✍ **జయభేరి, హైదరాబాద్:**

బీఆర్ఎస్ నేతలపై అసెంబ్లీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఛత్తీస్ గఢ్, యాదాద్రి, భద్రాద్రి ఒప్పందాలపై విచారణ చేయాలని బీఆర్ఎస్ నేతలే అడిగారని, అందుకే విచారణ కమిషన్‌ను నియమిం చామని తెలిపారు.కమిషన్ దగ్గరకు వచ్చి వివరాలు ఇవ్వాలని కోరితే కమిషన్ పైనే ఆరోపణలు చేశారని చెప్పారు.విచారణ కమిషన్ ముందు వాదన వినిపించకుండా కమిషన్ వద్దని కోర్టుకు వెళ్లారని తెలిపారు. విచారణ కొనసాగించా ల్సిందేనని సుప్రీంకోర్టు చెప్పిందని, కానీ కొత్త కమిషన్ చైర్మన్ ను నియ మించాలని ఆదేశించిందని అన్నారు. కొత్త చైర్మన్ ను సోమవారం నియమిస్తామని చెప్పారు.తెలంగాణకు బీఆర్ఎస్ నేతలే ఏదో కొత్త వెలుగులు తెచ్చినట్లు మాట్లాడుతు న్నారని తెలిపారు. వైఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోనే హైదరాబాద్ నగరానికి నిరంతర విద్యుత్ దక్కిందని చెప్పారు.ఏ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఆ ఆస్తులు, సంబంధిత ఆ రాష్ట్రానికే చెందుతాయని చట్టం ఉంద ని తెలిపారు.కానీ, ఉత్పత్తి ప్రాతిపదికన కాకుండా, వినియోగ ప్రాతిపదికన విభజన జరగాలని ఆనాడు జైపాల్ రెడ్డి కేంద్రాన్ని ఒప్పించారని చెప్పారు.రాజ్యాంగంలో లేని ప్రత్యేక మినహాయింపు తెలంగాణ కు ఇప్పించారని తెలిపారు. 53.46శాతం తెలంగాణకు, 46.54 శాతం ఏపీకి విద్యుత్ పంపిణీ చేసేలా జైపాల్ రెడ్డి తీవ్రంగా కృషి చేశారని, తెలంగాణ రాష్ట్రాన్ని చీకట్లు కమ్మకుండా చేశారని అన్నారు.సత్యహరిశ్చంద్రుడి తరువాత కేసీఆరే అన్నట్లు విద్యుత్ ఒప్పందాల విషయంలో బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని, ఇంకెన్నాళ్లు ఈ ఊదరగొట్టు మాటలు అని నిలదీశారు.

# ప్రతి మనిషిపై 1.44 లక్షల అప్పు..!

## భయపెడుతున్న ఆర్థిక కష్టాలు




✍ **జయభేరి, గుంటూరు, జూలై 29 :**

చంద్రబాబు దూకుడు మీద ఉన్నారు. ఒకవైపు పాలనను గాడిలో పెడుతూనే.. మరోవైపు వైసీపీ సర్కార్ వైఫల్యాలను బయటపెడుతున్నారు. జగన్ చేసిన తప్పిదాలను ఎండగడుతున్నారు. శాసనసభ వేదికగా శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నారు. అందులో భాగంగా ఈరోజు పదేళ్ల ఆర్థిక పరిస్థితి పై సీఎం చంద్రబాబు వైట్ పేపర్ రిలీజ్ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఆర్థిక పరిస్థితి ఏంటి? వైసిపి హయాంలో పాలన ఎలా సాగింది? విధ్వంసం ఏ రేంజ్ లో జరిగింది? దానిని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి? అన్న వివరాలను సీఎం

...మిగతాది 2 లో

# సివిల్స్ అభ్యర్థుల మరణం పాపం ఎవరిది..?



✍ **జయభేరి, న్యూఢిల్లీ, జూలై 29:**

ఢిల్లీ రావ్స్ కోచింగ్ సెంటర్ ఘటనపై విద్యార్థి లోకం భగ్గుమంటోంది. కోచింగ్ సెంటర్ సెల్లార్‌లో వరదనీటిలో మునిగి ముగ్గురు విద్యార్థులు చనిపోవడానికి నిర్వాహకులే కారణమంటూ స్టూడెంట్స్ భారీ ఆందోళన చేపట్టారు. కరోల్‌బాట్ మెట్రో స్టేషన్ దగ్గర విద్యార్థులు బైఠాయించారు. దీంతో పోలీసులు వాళ్లను అడ్డుకున్నారు. కరోల్‌బాగ్ మెట్రోస్టేషన్‌ను ముట్టడించిన వందలాదిమంది విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది ప్రమాదం కాదని , కోచింగ్ సెంటర్ నిర్వాహకులు , అధికారులు చేసిన హత్యలేనని విద్యార్థులు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.రావ్స్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ముగ్గురు యూపీఎస్సీ అభ్యర్థులు చనిపోయారు. ఇప్పటికే కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ఇద్దరిని అరెస్ట్ చేశారు పోలీసులు. కోచింగ్ సెంటర్ దగ్గర విద్యార్థుల ఆందోళనతో భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. సహచరుల మృతిపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోచింగ్

...మిగతాది 2 లో



# ఆగస్టు 15న ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

✍ **జయభేరి, ఢిల్లీ:**

త్వరలోనే ఆగస్టు 15 రానున్న నేపథ్యంలో దీని గురించి మోదీ ప్రస్తావించారు. గత కొన్నేళ్లుగా దేశంలో ప్రతి ఒక్కరిలోనూ దేశం పెరుగుతోందన్నారు.గతేడాది మాదిరిగానే ఈ సంవత్సవరం ఆగస్టు 15 కూడా ఘనంగా నిర్వహించాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.హర్ ఘర్ తిరంగ పేరుతో ఈసారి ఆగస్టు 15న కూడా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకంతో సెల్ఫీని http://hargartiranga.com వైబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దయచేసి ఈ సంవత్సరం కూడా ప్రజలు తమ సలహాలు, సూచనలు పంపాలన్నారు.

# ఆరోపణలు నిరూపించకపోతే..?

- మంత్రి కోమటిరెడ్డి, సిఎం రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాయాలి
- బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి డిమాండ్



✍ **జయభేరి, హైదరాబాద్ జూలై 29:**

తనపై ఆరోపణలు నిరూపించకపోతే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎం రేవంత్ రెడ్డి ఇద్దరు ముక్కు నేలకు రాయడంతో పాటు రాజీనామా చేయాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. తనపై ఆరోపణలు నిరూపించకపోతే సిఎం, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాజకీయాల్లోంచి వెళ్లిపోవాలని సవాల్ విసిరారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ఏ ఒక్కటి నిరూపించినా సభలో ముక్కు నేలకు రాసి రాజీనామా చేసి

...మిగతాది 2 లో

ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రతి మనిషిపై 1.44 లక్షల అప్పు..!

చంద్రబాబు స్వయంగా వెల్లడించారు. విభజన తర్వాత రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని.. తయారీ రంగం తెలంగాణకు వెళ్లిపోవడం.. ఏపీకి వ్యవసాయ రంగం మాత్రమే మిగలడంతో ఆర్థిక పురోగతి లేకుండా పోయిందని చెప్పుకొచ్చారు. అయినా సరే 2014 నుంచి 2019 మధ్య రాష్ట్ర అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం ప్రయత్నం చేసిందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి 16 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు ఒప్పందాలు చేసుకున్నామని.. అప్పట్లోనే ఐదు లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు చంద్రబాబు. విభజన సమస్యలు పరిష్కారం కాలేదని.. గత ఐదేళ్లుగా జగన్ చొరవ చూపలేదని.. అదే చేసి ఉంటే తెలంగాణతో సమానంగా ముందుకెళ్లేవారమని చంద్రబాబు వివరించారు. కనీసం టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను కొనసాగించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తయ్యేవన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం కొనసాగించి ఉంటే మూడు లక్షల కోట్ల ఆస్తి ఏపీకి సొంతమయ్యేది అన్నారు. జగన్ సర్కార్ ఆస్తులు తాకట్టు పెట్టి 9.74 లక్షల కోట్ల అప్పులు తెచ్చిందని వెల్లడించారు. శాసనసభలో కీలక విషయాలను వెల్లడించారు చంద్రబాబు. ముఖ్యంగా ప్రతి మనిషి పై అప్పు విషయంలో స్పష్టతనిచ్చారు. రాష్ట్రంలో ఒక్కరి పైన తలసరి అప్పు రూ. 1.44 లక్షలు గా ఉందని వెల్లడించారు. వైసిపి విధానాల కారణంగా రాష్ట్రానికి ఆదాయం వనరులు తగ్గుముఖం పట్టాయని.. అప్పులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు ఆదాయం పైన అప్పులు చేసిన ఒకే ఒక్కసారి జగన్ అని చంద్రబాబు ఆరోపించారు. ఇలాంటి ఆలోచనలు ప్రపంచంలో ఎవరికి రావని.. ప్రతి శాఖలోనూ నిధులను ఖాళీ చేశారని ప్రకటించారు చంద్రబాబు. వరుస శ్వేత పత్రాలతో వైసీపీకి చంద్రబాబు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు శ్వేత పత్రాలు విడుదల చేశారు. గనుల దోపిడీ ద్వారా రాష్ట్రానికి రూ. 9750 కోట్ల మేర నష్టం జరిగిందని చంద్రబాబు వెల్లడించారు. మద్యం విధానంతో 30 వేల కోట్లు పక్కదారి పట్టిందని కూడా ప్రకటించారు. విద్యుత్తు విధానాలతో రూ. 1.29 లక్షల కోట్లు నష్టం వాటిల్లిన విషయాన్ని ప్రస్తావించారు. మొత్తంగా వైసిపి రూ. 9.74లక్షల కోట్లు అప్పు చేసిన వైనాన్ని వెల్లడించారు చంద్రబాబు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వరుసగా శ్వేత పత్రాలు విడుదల చేస్తూ వచ్చారు చంద్రబాబు. మీడియా ప్రతినిధుల సమక్షంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీటిని వెల్లడించారు. అయితే శాసనసభ సమావేశాల నేపథ్యంలో.. జగన్ హాజరవుతారని తెలిసి వేదికను అసెంబ్లీకి మార్చారు. కానీ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపిస్తూ ఢిల్లీలో జగన్ దీక్ష చేపట్టారు. దీంతో అసెంబ్లీని వాకౌట్ చేశారు. అయినా సరే చంద్రబాబు శాఖల పనితీరుపై శ్వేత పత్రాల విడుదలను కొనసాగించారు. ఈరోజు ఆర్థిక శాఖ పై విడుదల చేసిన శ్వేత పత్రం లో వైసీపీ సర్కార్ చేసిన అప్పులను ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేశారు.

## ఆరోపణలు నిరూపించకపోతే..?

వెళ్లిపోవడంతో పాటు మళ్లీ రాజకీయాల్లోకి రాను అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. తనపైన ఒకటి కాదు మూడు హత్య కేసులు పెట్టారని, కాంగ్రెస్ పెట్టిన మూడు కేసుల్లో కోర్టులు తనని నిర్దోషిగా తేల్చాయని తెలియజేశారు. పెట్రోల్ బంక్‌లు, మిర్యాలగూడ కేసులు ఉన్నాయని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారని, వాళ్లు చెప్పిన కేసులపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. తాను మాట్లాడితే సిఎం రేవంత్ రెడ్డి భుజాలు ఎందుకు తడుముకుంటున్నారని, మా నాయకుడు కెసిఆర్ హరిశ్చంద్రుడేనని, వాళ్లలా సంచులు మోసే చంద్రుడు కాదని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. చంద్రుడి సంచులు మోసి జైలుకు వెళ్లింది రేవంత్ రెడ్డి అని చురకలంటించారు. విద్యుత్ అంశంలో అధికార పక్షం చేస్తున్న ఆరోపణలు సరైనవి కావన్నారు. కొత్తగూడెం విద్యుత్ ప్లాంట్ కూడా బిహెచ్‌ఎల్‌కే ఇచ్చామని, కోమటిరెడ్డి మాట్లాడిన ప్రతీ అక్షరం రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 'జగదీశ్వర్‌రెడ్డి సవాలు స్వీకరిస్తున్నా, నేను చేసిన ఆరోపణలు నిరూపించకపోతే మంత్రి, ఎంఎంఎల్ పదవులకు రాజీనామా చేస్తా' అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిసవాల్ విసిరారు.

## భారత్ పతాకాల్లో బోణి

జిన్ స్వర్ణం కైవసం చేసుకుంది. అదే దేశానికి చెందిన కిమ్ యేజి రజతంతో సరిపెట్టుకోగా, భారత్ కు చెందిన మను బాకర్ కాంస్యం నెగ్గింది. స్వర్ణం సాధించిన ఓ యే జిన్ ఓవరాల్ గా 242.2 పాయింట్లతో సత్తా చాటింది. రజతం సాధించిన కిమ్ యేజి 241.3 పాయింట్లు, మను బాకర్ 221.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకాన్ని సాధించింది.
2004లో ఏథెన్స్ లో జరిగిన ఒలింపిక్స్ నుంచి లండన్ 2012 ఒలింపిక్స్ వరకు వరుస మూడు విశ్వ క్రీడల ఈవెంట్లో షూటింగ్ విభాగంలో భారత్ పతకాలు సాధించింది. గత రెండు ఒలింపిక్స్ లో భారత్‌కు షూటింగ్ లో పతకం రాలేదు. తాజాగా పారిస్ ఒలింపిక్స్ లో 221.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన 22 ఏళ్ల మను బాకర్ కాంస్యం నెగ్గింది. 2004 ఒలింపిక్స్ లో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ భారత్ కు తొలి షూటింగ్ మెడల్ నెగ్గాడు. రజత పతకంతో దేశంలో షూటింగ్ పై ఆశలు రేపాడు. ఆపై బీజింగ్ లో జరిగిన 2008 ఒలింపిక్స్ లో అభినవ్ బింద్రా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో స్వర్ణం సాధించాడు. 2012లో లండన్ లో జరిగిన ఒలింపిక్స్ లో గగన్ నారంగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రజతకం, 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో విజయ్ కుమార్ కాంస్యం సాధించారు.
ఒలింపిక్స్ లో మహిళా షూటర్ భారత్‌కు తొలి పతకం సాధించడంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (IOC) సభ్యురాలు నీతా అంబానీ హర్షం వ్యక్తం చేశారు. 'ఇది ఎంతో అపురూపమైన క్షణం అని, పారిస్ ఒలింపిక్స్‌లో అతి పిన్న వయసులోనే మహిళా షూటర్ మను బాకర్ కాంస్యం సాధించింది. ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో మెడల్ సాధించిన తొలి భారతీయ మహిళగా, అతి పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించిన మను బాకర్‌కు అభినందనలు. ఈ రోజు నువ్వు సాధించిన విజయం భారతదేశంలో మరింత మంది యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందని నేను భావిస్తున్నాను. గో ఇండియా గో.. భారత్ గర్వపడేలా చేయండి' అన్నారు.

## మరణం పాపం ఎవరిది..?

సెంటర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, చనిపోయిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై విచారణకు ఆదేశించిన మంత్రి ఆతిషి.. నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించారు. ఈ సమయంలో వర్షపు నీటితో రావ్స్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ సెల్లార్ మునిగిపోయింది. సెల్లార్‌లో లైబ్రరీలో చదువుకుంటున్న ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. రాత్రి 7 గంటల సమయంలోనే తాము నీటిలో చిక్కుకున్నామంటూ పలువురు అభ్యర్థులు ఫైర్ స్టేషన్‌కు కాల్ చేశారు. ట్రాఫిక్ కారణంగా రెండు గంటల ఆలస్యంగా రావడంతో.. అప్పటికే నీటిలో చిక్కుకున్న వారిలో ఒకరు చనిపోయారు. పోలీసులు అక్కడకు వచ్చినా.. కొందరినే రక్షించగలిగారు. ఫైర్ సిబ్బందితోపాటు.. NDRF కూడా అక్కడకు చేరుకుని కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్ నుంచి నీటిని తోడే ప్రక్రియ ప్రారంభించారు. దాదాపు ఐదు గంటల పాటు శ్రమించినా... ముగ్గురు అభ్యర్థుల్ని కాపాడలేకపోయారు. రావ్స్ కోచింగ్ సెంటర్ రోడ్డు కంటే కిందకు ఉండటంతో.. వరద నీరు భారీగా వచ్చి చేరింది. వరద వస్తున్న సమయంలో సెల్లార్‌లోని లైబ్రరీలో దాదాపు 30మంది ఉన్నట్లు సివిల్ సర్వీస్ అభ్యర్థులు చెబుతున్నారు. చాలామంది వరద నుంచి తప్పించుకున్నా.. ముగ్గురు మాత్రం సెల్లార్‌లో చిక్కుకుని బయటకు రాలేక చనిపోయారు. వర్షం, వరదతో.. షార్ట్ సర్క్యూట్ కారణంగా.. లైబ్రరీలో బయోమెట్రిక్ డోర్స్ క్లోజ్ అయ్యాయని.. ప్రమాదం నుంచి బయటపడ్డవారు చెబుతున్నారు. మృతుల్లో ఒకరు సింగరేణి మేనేజర్ కూతురు తాన్య సోనిగా గుర్తించారు. తాన్య స్వస్థలం బీహార్. మరో ఇద్దరు యూపీ, కేరళకు చెందిన అభ్యర్థులుగా పోలీసులు తేల్చారు. నిబంధనల ప్రకారం సెల్లార్ పార్కింగ్ అవసరాలకు మాత్రమే వాడుకోవాలి. సెల్లార్‌లో లైబ్రరీలు, క్యాంటీన్‌లు ఏర్పాటు చేయొద్దు. సెల్లార్స్‌లో నివాసం కూడా ఉండొద్దు. పార్కింగ్‌కు తప్ప.. కమర్షియల్‌గా సెల్లార్స్ అస్సలు వాడొద్దు. బిల్డింగ్ కోడ్ కూడా ఇదే చెప్తోంది. అయినా.. నిబంధనలు ఎవ్వరూ పాటించడం లేదు. వాహనాల పార్కింగ్ అంతా రోడ్లపై చేస్తూ.. రూల్స్ విరుద్ధంగా లైబ్రరీలు, ఇతర అవసరాలకు సెల్లార్స్ వినియోగిస్తున్నారు. దీంతో రావ్స్ కోచింగ్ సెంటర్‌లాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. సివిల్స్ అభ్యర్థుల మృతిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో కోచింగ్ సెంటర్‌లో వరదలతో మృతిచెందిన.. సికింద్రాబాద్ యువతి తన్యా సోని తండ్రికి ఫోన్ చేశారు. ఫోన్‌లో విజయ్‌కుమార్‌ను పరామర్శించారు. ఢిల్లీ కోచింగ్ సెంటర్ ఘటన బాధాకరమన్నారు ఎమ్మెల్యే రాజాసింగ్. హైదరాబాద్‌లోనూ నిబంధనలకు విరుద్ధంగా నడిచే కోచింగ్ సెంటర్లు చాలా ఉన్నాయని చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతికి పాల్పడి.. అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు రాజాసింగ్.

# బలం.. బలగం... అంతా ఒక్కరేనా..!

✍ జయభేరి, హైదరాబాద్, జూలై 29:



సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రతిపక్షాలు అటాక్ చేస్తుంటే... కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కౌంటర్ అటాక్ చేయడంలో విఫలమవుతున్నారా.. అసెంబ్లీలో పదేపదే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగాల్సివస్తుందా? అసెంబ్లీ లాబీల్లో జరుగుతున్న చర్చేంటి? సీనియర్ నేతలు సైతం అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడంలో ఎందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు? అన్నింటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరే సరిపోతారని భావిస్తున్నారా..? 65 మంది ఎమ్మెల్యేలు.. కారు దిగేసి కొత్తగా జతకట్టిన ఎమ్మెల్యేలు మరో 10 మంది... ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి కాకుండా 11 మంది మంత్రులు... అదనంగా నలుగురు విప్‌లు... శాసనసభలో పూర్తి ఆధిపత్యం. ఇంత బలం బలగం ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కరే ఒంటరి పోరాటం చేస్తున్నట్లు కనిపిస్తోందా? నిజమే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గమనిస్తే... ప్రతిపక్షం దాడిని ఎదుర్కోవడంలో కాంగ్రెస్‌లో స్పష్టమైన వైఫల్యం కనిపిస్తోందంటున్నారు పరిశీలకులు. అసెంబ్లీ లాబీల్లోనూ ఇదేవిధమైన చర్చ జరుగుతుండటం తెలంగాణ కాంగ్రెస్‌లో ఉదాసీన వైఖరిని బయటపెడుతోందంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇటీవల సచివాలయంలో కొందరు మంత్రులకు క్లాసు పీకినా... పెద్దగా ఫలితం కనిపించడం లేదంటున్నారు. ప్రతి చిన్నవిషయానికి తానే స్పందించాల్సి వస్తోందని.. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకోవాలని గతంలో సీఎం చెప్పినా... ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరూ సీఎం వార్నింగ్‌ను సీరియస్‌గా తీసుకోలేదని అసెంబ్లీ సమావేశాల్లో మరోసారి తేలిపోయిందంటున్నారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డితో పాటు...చివరకు కొత్తగా సభలో అడుగుపెట్టిన కౌశిక్ రెడ్డిలాంటి ఎమ్మెల్యేలు సైతం.... సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తుంటే.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు స్పందించాల్సిన రీతిలో స్పందించడం లేదనే గుసగుసలు విన్పిస్తున్నాయి. అంతేకాదు... మరికొందరైతే విపక్ష నేతలు చేస్తున్న విమర్శలను ఎంజాయ్ చేస్తూ ముసిముసిగా నవ్వుకుంటున్నారట. అందుకే సభానాయకుడిగా ఉన్నప్పటికీ తనపై వస్తున్న విమర్శలకు సీఎం రేవంత్‌రెడ్డే స్వయంగా జవాబు చెప్పుకోవల్సి వస్తుందనే టాక్ విన్పిస్తుంది. ప్రతిపక్షం విమర్శలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు లైట్ తీసుకోవడం ఏంటనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. శాసనసభ లాబీల్లోనూ ఇదే విషయమై అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆసక్తికర చర్చ జరుగుతోంది. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సర్వసాధారణం. పైగా సభానాయకుడిగా ముఖ్యమంత్రిని టార్గెట్ చేయడమూ కామనే... అయితే విపక్షాలను కంట్రోల్ చేయడానికి సభానాయకుడు కన్నా, మంత్రులు, విప్, ఎమ్మెల్యేలే ఎక్కువగా చొరవచూపుతుంటారు. అంతా అయిపోయాక ముఖ్యమంత్రి మాట్లాడి ఆ అంశానికి ఫుల్‌స్టాప్ పెడుతుంటారు. ఏ శాసనసభలోనైనా ఇదే తీరు కనిపిస్తుంటుంది. ఐతే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య సమన్వయం కనిపించడం లేదంటున్నారు. ప్రతిపక్షం విమర్శలపై కౌంటర్ ఇచ్చే బాధ్యతను ఒకరిద్దరు తప్ప... మంత్రులెవరూ పెద్దగా భుజాలపై వేసుకోకపోవడంతో భారమంతా సీఎం రేవంత్‌రెడ్డిపైనే పడుతోంది. ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరూ చర్చల్లో పెద్దగా భాగస్వాములు కాలేకపోవడమే దీనికి కారణమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత అసెంబ్లీలో కాంగ్రెస్ తరపున జూనియర్ ఎమ్మెల్యేలే ఎక్కువగా ఉన్నారు. దీంతో సీనియర్లతో సమన్వయం చేసుకోలేకపోతున్నారనే వాదన వినిపిస్తోంది. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వంటి కొద్ది మంది మాత్రమే అసెంబ్లీలో సీఎంతోపాటు ప్రతిపక్షాన్ని ఎదుర్కొంటున్నారు. సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన సబ్జెక్టు వచ్చినప్పుడు మాత్రమే అసెంబ్లీలో గళం విప్పుతున్నారు. ఇక మిగిలిన వారు ఎవరూ ప్రభుత్వంపై విమర్శలకు పెద్దగా స్పందిస్తున్న దాఖలా కనిపించడం లేదనే గుసగుసలు విన్పిస్తున్నాయి. సీఎం కూడా మంత్రులు కల్పించుకోవాలని సూచిస్తున్నా... వారు పెద్దగా పట్టించుకోకపోవడం అధికార పార్టీలోనే చర్చకు దారితీస్తోంది. అన్నీ సీఎం చూసుకుంటారులే అన్న ఉదాసీన ధోరణే మంత్రులు, ఎమ్మెల్యేల్లో ఎక్కువగా కనిపిస్తుండటంతో ప్రతిపక్షం పైచేయి సాధించేలా కనిపిస్తోందంటున్నారు. మరి ఈ పరిస్థితిని కాంగ్రెస్ ఎలా అధిగమిస్తుంది? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

# అసెంబ్లీలో విద్యుత్ మంటలు

✍ జయభేరి, హైదరాబాద్ :



తెలంగాణ అసెంబ్లీలో విద్యుత్ సంస్కరణలపై వాడీవేడీ చర్చ జరిగింది. అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడిచింది. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యుత్ సంస్కరణల పేరుతో అప్పనంగా ప్రభుత్వం సొమ్మును దొచుకున్నారని అటెండర్ ఉద్యోగాన్ని కూడా తమ వాళ్లకే ఇచ్చుకొని విద్యుత్ శాఖనే సర్వనాశనం చేశారని ఆరోపించారు. ప్రతి ప్రాజెక్టులో బీనామీలతో టెండర్లు పిలిచి వేల కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు రేవంత్. ఇంత చేసినా నిజాయితీపరులు మాదిరిగా మాట్లాడుతున్నారని అన్నారు. సత్యహరిశ్చంద్రుల వారుసలమని చెప్పుకుంటున్న వారు విద్యుత్ కమిషన్ విచారణకు ఎందుకు హాజరుకావడం లేదని అన్నారు. విద్యుత్ సంస్కరణ పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ కోరింది వారేనని... అలాంటి విచారణకు ఎందుకు హాజరుకావడం లేదని ప్రశ్నించారు. దీనిపై కోర్టుకు వెళ్లి కూడా ఎదురు దెబ్బతిన్నారని అన్నారు. కోర్టు ఆదేశాల మేరకు తాము విచారణాధికారిని కూడా మార్చామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వెలుగులకు కేసీఆర్ పాలన కారణం కాదని.. అంతకంటే ముందు సోనియా గాంధీ, జైపాల్‌రెడ్డి చొరవతోనే తెలంగాణ విద్యుత్ కొరత తీరిందని చెప్పారు. ఇదే విషయాన్ని తాను టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సభ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. అప్పట్లో తాను నిజాలు మాట్లాడితే తనను మార్షల్‌స్‌తో బయటకు నెట్టేశారని అన్నారు.
ఇప్పుడు విద్యుత్ గురించి చెబుతున్న వారంతా రాష్ట్రానికి చేసిందేమీ లేదని అన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ వాళ్లు ఏదో కొత్త వెలుగులు తెచ్చినట్లు మాట్లాడుతున్నారని అదంతా బూటకమన్నారు రేవంత్ రెడ్డి. చంద్రబాబు, వైఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోనే హైదరాబాద్ నగరానికి నిరంతర విద్యుత్ వెలుగు వచ్చాయని గుర్తు చేశారు. ఏ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఆ ఆస్తులు సంబంధిత ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందుతాయని చట్టం ఉందని... కానీ ఉత్పత్తి ప్రాతిపదికన కాకుండా, వినియోగ ప్రాతిపదికన విభజన జరగాలని ఆనాడు జైపాల్ రెడ్డి కేంద్రాన్ని ఒప్పించారని వివరించారు. రాజ్యాంగంలో లేని ప్రత్యేక మినహాయింపు తెలంగాణకు ఇప్పించారని తెలిపారు. 53.46శాతం తెలంగాణకు, 46.54 శాతం ఏపీకి విద్యుత్ పంపిణీ చేసేలా జైపాల్ రెడ్డి సోనియాగాంధీని ఒప్పించారన్నారు. జైపాల్ రెడ్డి కృషి, సోనియా చలవతోనే తెలంగాణ రాష్ట్రాన్ని చీకట్లు కమ్మకుండా చేశారన్నారు రేవంత్. ఆనాడు కేసీఆర్ ఎలా సభను తప్పుదోవ పట్టించారో 2015 రికార్డులు తీయండని సభాపతికి రిక్వెస్ట్ పెట్టారు. ఆనాడు తాను సభలో మాట్లాడితే మార్షల్‌స్‌తో బయటకు పంపించారని వివరించారు. సోలార్ ప్రాజెక్ట్ గురించి గొప్పగా చెబుతున్నారని... అవి ప్రైవేటు కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ఏలుబడిలో సోలార్ పవర్ కేవలం ఒక మెగావాట్ మాత్రమేనని వివరించారు. పవర్ ప్లాంట్‌స్‌కు సంబంధించి ఎలక్ట్రో మెకానికల్ వర్క్, సివిల్ వర్క్ కాంట్రాక్టు విషయంలో బీఆర్ఎస్ తెలివి ప్రదర్శించిందన్నారు. గంపగుత్తగా బీహెచ్ఎల్ కాంట్రాక్టు అప్పగించారన్నారు. బీహెచ్ఈఎల్ నుంచి సివిల్ వర్క్స్ మొత్తం వీళ్ల బినామీలు, బంధువులు, అనుయాయులకు ఇచ్చారని ఆరోపించారు. అందులో వేలకోట్ల ఫ్రాడ్ జరిగిందని విమర్శించారు. విచారణలో అంతా బయటపడుతుందనే ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. 2400 మెగావాట్ల విద్యుత్ ప్లాంటుకు టెండర్ వేస్తే సూపర్ క్రిటికల్ టెండర్ పిలిస్తే కొరియన్, బీహెచ్ఈఎల్, మరో కంపెనీ పాల్గొన్నాయని వివరించారు రేవంత్. అక్కడ 18శాతం లెస్‌కు బీహెచ్ఈఎల్ పనులు దక్కించుకుందని.. ఇక్కడ కూడా 18శాతం లెస్‌కు పనులు చేసే అవకాశం ఉన్నా.. ప్రాజెక్టును నామినేషన్‌పై బీహెచ్ఈఎల్‌కు అప్పగించారన్నారు.
అందులో దాదాపు 8వేల కోట్లు కుంభకోణం జరిగిందని తెలిపారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు విషయంలో సబ్ క్రిటికల్ టెక్నాలజీతో గుజరాత్‌లోని ఇండియా బుల్స్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారన్నారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించాలని చట్టంలో ఉన్నా ఉల్లంఘించారని అన్నారు. ఇండియా బుల్స్ నుంచి వెయ్యి కోట్లు మెక్కి కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించారన్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్ కట్టాల్సిన చోట కట్టలేదని...వీళ్ల నిర్వాకంతో 16మంది అధికారులు విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న పరిస్థితి దాపురించిందన్నారు. వారి కోరిక మేరకే విచారణ కమిషన్ ఏర్పాటు చేశామని దొరికిపోయామని అర్థమైంది కాబట్టే కమిషన్ పై ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. కావాలన్నది వాళ్లే సెగ తగలగానే వద్దన్నది వాళ్లేనంటూ ఎద్దేవా చేశారు. తిన్నింటి వాసాలులేక్కబెట్టే లక్షణాలు తమకు లేవన్నారు రేవంత్ రెడ్డి. ఆ వాదన ఏంటో కమిషన్ ముందు చెప్పాలని సూచించారు. సాయంత్రానికల్లా విచారణ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను నియమిస్తామన్నారు. రూ.81వేల కోట్లు అప్పులకు కారణమైన వాళ్లు ఇప్పుడు నల్లగొండ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనే బీఆర్ఎస్ సంగతి తేలిపోయిందన్నారు రేవంత్. పవర్ ప్లాంట్ పేరుతో దోచుకున్నారని అన్నారు.

**విద్యుత్ పై విచారణ కమిషన్**

విద్యుత్ కుంభకోణాలపై విచారణ చేస్తున్న కమిషన్‌కు కొత్త ఛైర్మన్ నియమిస్తామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. విద్యుత్‌పై సభలో జరిగిన చర్చ సందర్భంగా ఈ విషయాన్ని ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాల బిజీ కారణంగా ఇన్ని రోజులు ఆలస్యమైందని సభకు వివరించారు. విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమై పేరుపై నిర్ణయం తీసుకుంటామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ చెప్పినట్టుగానే సాయంత్రానికి విద్యుత్ కమిషనకు కొత్త ఛైర్మన్‌ను నియమిస్తామని సభలో వివరించారు రేవంత్ రెడ్డి. అసెంబ్లీ సమావేశాలు వల్ల కాస్త ఆలస్యమైందని గుర్తు చేశారు. ఇప్పుడే దీనిపై విద్యుత్ శాఖ మంత్రితో కూర్చొని చర్చించి ఛైర్మన్ పేరు ప్రకటిస్తామన్నారు. ఈ కమిషన్ విషయంలో కోర్టు తీర్పును కూడా బీఆర్ఎస్ సభ్యులు వక్రీకరించి సభను తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. ఇలా మాట్లాడితే కచ్చితంగా ఇలా మాట్లాడేవాళ్లను కూడా ప్రాసిక్యూషన్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కమిషన్ ఛైర్మన్‌ను మార్చాలని మాత్రమే సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని వివరించారు. విచారణపై ఎటువంటి కామెంట్స్ చేయలేదని ఆపాలనే తీర్పు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ నేతల కోరిక మేరకే విచారణ కమిషన్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు రేవంత్. ఇప్పుడు దొరికిపోయామని అర్థమైంది కాబట్టే కమిషన్ పై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కావాలన్నది వాళ్లే సెగ తగలగానే వద్దంటూ కోర్టులకు వెళ్తున్నది వాళ్లేనన్నారు. తిన్నింటి వాసాలులేక్కబెట్టే బుద్ధులు తమకు లేవన్నారు రేవంత్ రెడ్డి. విద్యుత్ కుంభకోణంపై సభలో చేస్తున్న వాదన ఏంటో కమిషన్ ముందు చెప్పాలని సూచించారు. ఛత్తీస్‌గఢ్, యాదాద్రి, భద్రాద్రి ఒప్పందాలపై బీఆర్ఎస్ సభ్యులే విచారణకు డిమాండ్ చేశారని తెలియజేశారు. బీఆర్ఎస్ సభ్యుల కోరిక మేరకే విచారణ కమిషన్ వేశామన్నారు. కమిషన్ దగ్గరకు వచ్చి వివరాలు ఇవ్వాలని కోరితే కమిషన్‌పైనే ఆరోపణలు చేశారన్నారు. తీరా విచారణకు హాజరై వివరాలు ఇస్తారేమో అని చూస్తే కమిషన్‌ను రద్దు చేయాలని కోర్టులకు వెళ్లారని ఎద్దేవా చేశారు. హైకోర్టులో వాళ్ల పిటిషన్ కొట్టివేత గురైందని... తర్వాత సుప్రీంకోర్టులో వేశారని గుర్తు చేశారు. అక్కడ విచారణ కొనసాగించాల్సిందేనని సుప్రీంకోర్టు చెప్పిందని... కానీ కొత్త కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలని సూచించిందన్నారు. దీనిపై తమను అడిగితే ఛైర్మన్‌ను మార్చడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇండియా బుల్స్ నుంచి రూ.1000 కోట్లు బీఆర్ఎస్ నేతలు దండుకున్నారన్నారు రేవంత్ రెడ్డి. పదేళ్లు బీఆర్ఎస్ చేసిన నిర్వాకంతో భద్రాద్రి పవర్ ప్లాంట్ నీళ్లలో నేటికీ మునిగిపోతోందని వాపోయారు. 2021లో పూర్తి చేస్తామని బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం చేసుకుంటే ఇప్పటి వరకు పూర్తి కాలేదని వివరించారు. ఇంకా ఎన్ని రోజులకు పూర్తి అవుతుందో కూడా తెలియదని అన్నారు.

# చలో - హైధరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- సెంట్రలైజ్డ్ కిచెన్ విధానంతో వంట కార్మికుల పొట్టలు కొట్టే విధానాన్ని విరమించుకోవాలి




**జయభేరి, దేవరకొండ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హరే రామ హరే కృష్ణ సంస్థ ప్రతినిధులతో చర్చించి, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానంతో, కొడంగల్ ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టుగా విధ్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని చెప్పడం వల్ల, రాష్ట్రంలో 5400,వేల పాఠశాల వంట కార్మికుల జీవితాలపై దెబ్బ కొట్టేందుకు సిద్ధమైనట్లుగా ఉందని, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధ), ఏఐటియుసి నల్లగొండ జిల్లా కార్యదర్శి పల్ల దేవేందర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అన్నారు. 22 సంవత్సరాలుగా ఈ పథకం ద్వారా వంటలు చేస్తూ, విద్యార్థులకు స్వంత డబ్బులు పెట్టి, పాఠశాలలో వంటలు చేస్తూ, వంట బిల్లులు వచ్చినప్పుడు తీసుకుని, నాణ్యమైన భోజనం అందిస్తూ, అనేక ప్రభుత్వాలు వచ్చినా ప్రైవేటించకుండా చూస్తూ, కార్మికులకు న్యాయం చేయాలని చూసారు. కానీ ఏరి కోరి తెచ్చుకున్న కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం కార్మికులకు పెంచుతామన్న వేతనాల విషయంలో ఆలోచించకుండా, హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా వంటలు చేయడానికి ప్రయత్నించడం చాలా అన్యాయం అని, జంపాల రవీందర్ అన్నారు. కనుక ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, రాష్ట్రంలో ఉన్న 54000, వంట కార్మికులు, వారి కుటుంబాలను, రోడ్డున పడకుండా పునరాలోచన చేయాలని కోరారు. పాఠశాల వంట కార్మికులు చేసిన అనేక పోరాటాలలో, ప్రస్తుతం ఉన్న మంత్రులు, స్వయంగా రేవంత్ రెడ్డి కూడా పాల్గొని సంఘీభావం తెలపడమేకాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో ఒక్క వంట కార్మికురాలుకి అన్యాయం చేయం ఎవ్వరినీ తొలగించకుండా జిఓ కూడా తీసుకు వస్తామని చెప్పి, వేతనం కూడా రూ. 10 000/ అందిస్తామని చెప్పారు. ఆ విషయాన్ని మరిచిపోకూడదని అన్నారు. ఈ విషయం పై వంట కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు డివిజన్ కోశాధికారి జూలూరు వెంకట్రాములు, మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు జంపుల జంగమ్మ, మండల కార్యదర్శి ఆలమోని మల్లయ్య, నోముల ధనలక్ష్మి, పసుల శోభారాణి, అందుగుల భాగ్యమ్మ, దామోజు మౌనిక, గోలి అంజలమ్మ, సిటీల మెట్ల శ్యామలమ్మ, పసుపుల కుమారి, పల్లె అలివేల, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నీటి ప్రవాహం ఎక్కువ ఉన్న చోట సెల్ఫీలు, ఈత కొట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలి
- అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలి... మహమ్మద్ అయ్యుబ్ ఖాన్, నేరేడుగోమ్ము మండల డిప్యూటీ తహసిల్దార్

**జయభేరి, నేరేడు గొమ్ము :**

కృష్ణ నదిపై ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు సోమవారం ఎత్తు నీరు దిగువకు వదులు తుండడంతో నేరేడుగొమ్ము, చందంపేట, పీఏ పల్లి మండలాల సరిహద్దు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేరేడుగొమ్ము మండల డిప్యూటీ తాసిల్దార్ మొహమ్మద్ అయ్యుబ్ ఖాన్ తెలిపారు. వరద ఉధృతి ప్రవాహం పెరుగుతుండడంతో నదిలోకి వెళ్లకూడదని ప్రజలు జాగ్రత్తలు వహించాలని కోరారు. నేరేడుగొమ్ము మండలంలోని సాగర్ బ్యాక్ వాటర్ వైజాగ్ కాలనీ వద్ద మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు . ఎలాంటి అత్యవసర సమయంలోనైనా ప్రజలు పోలీసులను సంప్రదించాలని కోరారు. చెరువులు కాలువలు కుంటల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నీటి ప్రవాహం ఉన్నచోట రాకపోకలపై దృష్టి సాధించాలని తెలియజేశారు. ప్రజలు పోలీసు వారి సలహాలు, సూచనలు పాటిస్తూ సహకరించాలని అన్నారు. వాగుల పరివాహ గ్రామ ప్రజలు పిల్లలు యువకులు, నది దగ్గరకు సెల్ఫీలు తీయడానికి ఈతలు కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు పూర్తి దృష్టి సాధించాలని కోరారు.

## ఘనంగా తొట్టెల ఊరేగింపు



**జయభేరి, సైదాబాద్:**

బోనాల ఉత్సవాల్లో భాగంగా కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సైదాబాద్లో నిర్వహించిన తొట్టెలు, ఫలహారం బండ్ల ఊరేగింపు ఘనంగా కొనసాగింది.. ఈ ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు. కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెడ్డి బస్తి కార్పొరేటర్ నివాసం నుడి ప్రారంభమైన నాగులమ్మ ఆలయం వరకు ఊరేగింపు సైదాబాద్ బస్తీల మీదుగా కొనసాగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నగరవాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిలో భాగమన్నారు. మతసామరస్యానికి పాతనగరం ప్రతీక అని, అన్ని కులాలు, మతాలు తమ పండుగలను సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకుంటున్నారని తెలిపారు. గత 21 ఏళ్లుగా ఫలహార బండి బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నామని చెప్పారు.

## అద్రాస్ పల్లిలో దారుణం

- పాత కక్షల నేపథ్యంలో పరస్పరం దాడులు
- పలువురికి గాయాలు
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**జయభేరి, జులై 29:**



పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అద్రాస్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జీడి మహేష్, తన బావ మరిది జూపల్లి మల్లేష్, నాగరాజు మరియు జీడి మల్లేష్, నర్సింహా, బాబులు గత రాత్రి సమయంలో కలుసుకున్నారు. కాగా పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని ఒకరిపై మరొకరు కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో జీడి నరసింహ చేతికి గాయలవగా జీడి మహేష్ కు ఛాతి భాగంలో జూపల్లి మహేష్ కు మొహంపై గాయాలయ్యాయి. కాగా ఈ ఘటనపై శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బ్రిడ్జి పై చెట్లని వెంటనే తొలగించాలి

- అమ్మ ఫౌండేషన్

**జయభేరి, జనగామ, జులై 29:**




పట్టణంలోని నెహ్రూ పార్క్ నుండి జిల్లా హాస్పటల్ వరకు ఉన్న బ్రిడ్జ్ ఫ్లై ఓవర్ పై ఉన్న చెట్లను వెంటనే తొలగించాలి ప్రమాదకరమైన పగుళ్లు ఫ్లై ఓవర్ పైన ఫుట్పాత్ పైన ఉన్నటువంటి పూల కుండీలను తొలగించి బాటసారిలకు ఇబ్బందికరంగా ఉండకుండా చూడాలి సమస్యలను పరిష్కరించాలి.ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ టీం ఫ్లైఓవర్ ని పరిశీలించి అక్కడున్న సమస్యలను జనగామ ఆర్ అండ్ బి జనగామ మున్సిపల్ కమిషనర్ పరిష్కరించాలని కోరిన జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి కుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఫ్లైఓవర్ నిర్మించి గడుస్తున్న తరుణంలో వర్షాకాలం బ్రిడ్జ్ పై ఉన్న ప్రతి పిల్లర్ వద్ద పగుళ్లు వచ్చి అక్కడ చెట్లు పెరుగుతూ వస్తున్నాయి వాటిని వెంటనే తొలగించాలని ఫ్లైఓవర్ బ్రిడ్జ్ పై ఉన్న పూల కుండీలు చాలా పెద్దవి ఉండడం వల్ల పాదాచారులు ఫుట్పాత్లో ప్రయాణం చేయలేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు అండర్ బ్రిడ్జి నుంచి బ్రిడ్జి పైకి ఎక్కే క్రమంలో రెండు చోట్ల చాలా ప్రమాదకరంగా ప్లాస్టింగ్ ఊడిపోయి ఇనుప మేకులు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్నాయి వెంటనే ప్లాస్టింగ్ చేయాలి నెహ్రూ పార్క్ నుండి జనగామ జిల్లా ఆసుపత్రి వచ్చే క్రమంలో ఫ్లైఓవర్ ఎక్కిడిగాక ఎదురుగా ఉన్న డివైడర్ వద్ద అనేక యాక్సిడెంట్లు జరిగి లారీలు బైకులు వచ్చి ప్రమాదానికి గురవుతున్నారు ప్రమాదం జరిగినప్పుడల్లా దాన్ని రిపేరు చేస్తున్నారు కానీ అక్కడ ఎటువంటి ప్రమాదకర హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేకపోవడం చాలా బాధాకరం వెంటనే రేడియం తో కూడిన డివైడర్ ఉన్న విషయాన్ని తెలిసేలా బోర్డును ఏర్పాటు చేయాలి.వెంటనే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమస్యలపై గౌరవ జనగామ మున్సిపల్ కమిషనర్ గారు మరియు చైర్మన్ గారు ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్వయంగా పరిశీలించి ఇక్కడున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని జనగామ ప్రజల పక్షాన వేడుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు లకన్ సింగ్, కొల్లూరు చందు, చిక్కుడు నాగేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్.. కేటీఆర్ ఆస్తులు పణంగా పెట్టి ప్రాజెక్టులు కట్టలేదు

**జయభేరి, హైదరాబాద్:**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్.. ఆస్తులు పణంగా పెట్టి ప్రాజెక్టులు కట్టలేదు, మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మించినప్పటి నుంచే లీకేజీలు ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్ట్ పునాదుల నుంచే సరిగా పనులు జరగలేదన్నారు. కేసీఆర్, కేటీఆర్ వారి ఆస్తులు పణంగా పెట్టి ప్రాజెక్టులు కట్టలేదని. తెలంగాణ ప్రజలను తాకట్టు పెట్టి కట్టారని మండిపడ్డారు. ప్రాజెక్ట్ ను రిపేర్ చేయడానికే తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కాళేశ్వరం పై మంత్రి కేటీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని అన్నారు.






## మూడవ రోజుకు చేరుకున్న ఆందోళన

- ఢిల్లీ లోని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (AICC) భవన్ ముందు మూడవ రోజుకు చేరుకున్న ఆందోళన కార్యక్రమం

లంబాడి గిరిజనులకు గిరిజన మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన జేఏసీ అశోక్ రాథోడ్, బాబురామ్ నాయక్, లకపతి నాయక్, శివ నాయక్ల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం మూడవ రోజుకు చేరుకుంది. సోమవారం ఢిల్లీలోని (ఏఐసిసి) కార్యాలయం వద్ద గిరిజన లంబాడి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష సోమవారం కూడా కొనసాగింది. తండాలు అభివృద్ధి చెందాలంటే గిరిజనులకే గిరిజన మంత్రి పదవి ఇవ్వాలని ప్లేకాడ్ లతో నిరసన కార్యక్రమం చేస్తున్నామని నంగావత్ భాస్కర్ నాయక్ తెలిపారు. గిరిజన లంబాడి లకు రాష్ట్ర క్యాబినేట్లో మంత్రి పదవి ఇచ్చేవరకు మా ఉద్యమాన్ని కొనసాగిస్తామని లంబాడి సంఘాల జేఏసీ తెలిపారు.

## బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**జయభేరి, జనగామ, జులై 28:**

కెవిపిఎస్ జిల్లా వ్యాప్తంగా హాస్టల్ అధ్యయన యాత్ర కొనసాగుతాయి ఈ యాత్రలో భాగంగా జనగామ మండలం పెంబర్తి గ్రామంలో బీసీ హాస్టల్ సందర్శించడం జరిగింది విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. అక్కడ ఉన్న పరిస్థితులను చూస్తే చాలా ఇబ్బందికరంగా ఉన్నది ఇప్పటివరకు స్కూలు యూనిఫాంలో ఇవ్వలేదు నోట్ బుక్స్ ఇవ్వలేదు అలాగే తాగడానికి వాటర్ ప్యూరిఫైయర్ లేక ట్యాంక్ వాటర్ తాగుతున్నారు విద్యార్థులు పడుకోవడానికి మంచాలు బెడ్లు ఉన్నా కానీ వాటిని ఫిట్ చేయడం లోపం ఉన్నది విద్యార్థులు స్కూల్ ప్రారంభమైన కాల్చి క్లాస్ రూమ్ లో పడుకుంటున్న పరిస్థితి ఉన్నది విద్యార్థులు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఏమి లేని పరిస్థితి ఉన్నది అలాగే టీచర్స్ అక్కడున్న స్టాఫ్ రావడానికి పోవడానికి కనీస రవాణా మార్గం లేక చాలా ఇబ్బందిగా డ్యూటీ కి వస్తున్న పరిస్థితి ఉన్నది. కాబట్టి అక్కడ ఉన్న హాస్టల్లో తక్షణమే మార్చి రవాణా సౌకర్యం అన్ని వసతులు కలిగిన ప్రాంతంలో పెట్టాలని డిమాండ్ చేస్తారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం యాదగిరి విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్ధం కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ సీనియర్ సభ్యురాలు శ్రీమతి చింతోజు భారతమ్మ రిటైర్డ్ సూపరింటెండెంట్ తన తల్లి దండ్రులు కీ.శే గౌరోజు బ్రాహ్మయ్య దంపతుల జ్ఞాపకార్ధం జంగాల కాలనీ ఒక బీద కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినారు. అని అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి, పంగునూరు లింగయ్య తెలియజేసినారు. దాత మాట్లాడుతూ.. మా తల్లిదండ్రుల జ్ఞాపకార్ధం బీదకుటుంబంనకు సహాయం చేసే అవకాశం కల్పించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసినారు. సహాయం పొందిన కుటుంబం దాత దానగుణమును అభినందించినారు. ఈ కార్యక్రమంలో కార్యనివాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, ప్రచార కార్యదర్శి పగిడిమర్రి సత్యమూర్తి, జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, ఆడిటర్ వనం బుచ్చయ్య, కార్యవర్గం సభ్యులు జంపాల యాదగిరి, అస్సం పాండు, కర్నాటి సత్యనారాయణ, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## బాలిక బ్రెయిన్డెడ్..

- పది మందికి ప్రాణదానం

**జయభేరి, మేడ్చల్:**

కళాశాలకు వెళ్తుండగా బాలికకు ఫిట్స్ వచ్చి బ్రెయిన్ డెడ్ అయింది. చికిత్స చేయించినా పలితం లేకుండా పోయింది. బాలిక బతుకుతుందనే వైద్యులు భరోసా ఇవ్వ లేదు. బాలిక తల్లిదండ్రులు పుట్టెడు దుఃఖంతో బాలిక అవయవాలు దానం చేసి మరో పదిమందికి ప్రాణం పోశారు. మేడ్చల్ పట్టణానికి చెందిన కూర శ్రీనివాస్, సరిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నాడు. రెండో కూతురు కూర దీపిక(16) నగరంలోని ఓ కళాశా లలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 22న ఇంటి నుంచి బయలుదేరే సమ యంలో వాంతులతో ఫిట్స్ వచ్చి ఇంట్లోనే కుప్పకూలింది. నగరంలోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. బాలికను పరీక్షించిన వైద్యులు అవయవాలు స్పందించడం లేదని వెంటిలేటర్ పై వైద్యం అందించారు. బ్రెయిన్ డెడ్ అయ్యిందని వైద్యులు తేల్చారు. ఆ తల్లి దండ్రులకు వచ్చిన ఆలోచనతో ఆసుపత్రి వర్గాలతో సంప్రదించి బాలిక అవయ వాలు దానం చేసేందుకు నిర్ణయించారు. ఈనెల 25న బాలిక మృతి చెందడంతో బాలిక అవయవాలతో పది మందికి ప్రాణం పోశారు. ఇదే విషయం పై మేడ్చల్ పట్టణంలోని సోషల్ మీడియా వేదికగా బాలిక తల్లిదండ్రులను అభినందిస్తున్నారు.




## విద్యుత్ సభ బాధ్యులకు అభినందనలు

✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ విద్వత్ సభ ఆధ్వర్యంలో పంచాంగకర్తలు, సిద్ధాంతులు ధర్మశాస్త్రాలకు అనుగుణంగా చర్చించి, నిర్ణయించి, ఆమోదించిన విశ్వావసునామ సంవత్సరం 202526 పండుగల జాబితాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అసెంబ్లీలోని వారి కార్యాలయంలో, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖకి జూబ్లీ హిల్స్ లోని వారి నివాసంలో విద్వత్ సభ బాధ్యులు అందించారు. ఈ సందర్భంగా విద్యత్ సభ బాధ్యులను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సురేఖ అభినందించారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రాధ్యాతనిస్తూ విద్వత్ సభ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశాంసనీయమైనవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వారికి ఏ అవసరం వచ్చినా తీర్చాలని దేవాదాయ శాఖకు సీఎం సూచించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పండుగల నిర్వహణలో ఎలాంటి అనిశ్చితి తలెత్తకుండా పండుగల జాబితాను నిర్ధారించి అందించిన విద్వత్ సభను మంత్రి సురేఖ అభినందించారు. వారి కృషి ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, భద్రకాళి దేవాలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, యాదాద్రి దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నర్సింహాచార్యులు, తెలంగాణ విద్వత్ సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, కోశాధికారి ఎంవిఆర్ శర్మ (దర్శనం శర్మ), వేదంపండితులు నటరాజ శర్మ, సాయి దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.


## ఫ్రీ బస్సును తెలంగాణ మహాలక్ష్మిలు ఇలా కూడా వాడేసుకుంటున్నారా?



✍ జయభేరి, హైదరాబాద్, జులై 29 :

కాంగ్రెస్ ప్రభుత్వం మహి ళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం ఎంతమందికి ఉపయోగపడుతుందో, తెలియదు కానీ.. నిత్యం మన తెలంగాణ మహాలక్ష్మిలు మాత్రం సీటు కోసం కొట్టుకోవడం, జాకెట్లకు పోతలు పోసుకుంటూ జర్నీ చేయడం, బీడీలు చుట్టడం, ఎల్లిపాయలు తీయడం లాంటి సంఘ టనలతో వార్తల్లోకి ఎక్కిస్తున్నారు. అసలే తెలంగాణలో అరకొరగా ఉన్న బస్సుల్లో మహిళలే అధికంగా ప్రయాణిస్తుండటంతో మగవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పండుగ వేళల్లో అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. మగవారు పడుతున్న కష్టాల గురించి.. అయితే ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ టికెట్ ఏ కదా? అని మహిళలు.. అవసరం ఉన్నా, లేకున్నా బస్సులు ఎక్కేస్తున్నారనే విమర్శలు చాలా ఉన్నాయి. దానికి ఉదాహరణగా తాజాగా ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఎక్కడ జరిగిందో స్పష్టంగా తెలియదు కానీ.. టీజీఎస్ ఆర్టీసీ బస్సులో డ్రైవర్ వెనుక సీట్లో కూర్చున్న ఓ మహిళ.. ప్రశాతంగా బ్రష్ చేస్తూ కనిపించింది. ఈ వీడియో చూసిన కొంతమంది మాత్రం రాను పోను ఫ్రీ బస్సు ఏ కదా? అని కూరలోకీ కోతిమీర తీసుకురావడానికి వాళ్ల అమ్మగారింటికి వెళ్తుంది, కావచ్చు అంటున్నారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద



✍ జయభేరి, శ్రీశైలం:

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం పెరిగింది. దీంతో ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో ఇన్ ఫ్లో 3,43,888 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఔట్ ఫ్లో 57,300 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు. అటు శ్రీశైలం జలాశయానికి భారీగా చేరుకుంటున్నాయి తుంగభద్ర జలాలు. ఇవాళ మధ్యాహ్నానికి ఇన్ ఫ్లో 4 లక్షల క్యూసెక్కులకు పైగా వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పూర్తి స్దాయి నీటిమట్టం 885 అడుగులుగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం 863.40 అడుగులు ఉన్నాయని చెప్పారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు ఉన్నట్లు వివరించారు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం 116.9200 టీఎంసీలు అని తెలిపారు. కుడి గట్టు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు వెల్లడించారు అధికారులు. ఇక అటు నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఇన్ ఫ్లో 52,199 క్యూసెక్కులు ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు ఉన్నాయి. ప్రస్తుత నీటి మట్టం 506.60 అడుగులు ఉన్నాయి.

# ఘనంగా ఏసిరెడ్డి నరసింహ్మారెడ్డి వర్ధంతి

✍ జయభేరి, జనగామ, జులై 28 :




దోపిడీ అణిచివేతకు వ్యతిరేఖంగా తెలంగాణ ప్రాంతంలో భూమికోసం భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తికోసం పీడిత ప్రజల పక్షాన జరిపిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని చరిత్రలో సువర్ణాక్షరములతో వ్రాయబడిందని జనగామ గడ్డపై సాయుధపోరాటంకు ముందుండి నడిపించిన ప్రజా నేత ఉద్యమ సూర్యుడు త్యాగశీలి అమరజీవి కామ్రేడ్ ఏ.సి.రెడ్డి నర్సింహ్మారెడ్డి అని ఆయన 33 వ వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా హాజరైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆదివారం రోజున సిపిఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్ లో ఏసిరెడ్డి నర్సింహారెడ్డి 33వ వర్ధంతి సభ ఏర్పాటు చేయడం జరిగింది. సభ ప్రారంభానికి ముందు స్థానిక బస్టాండ్ చౌరస్తా నుండి డప్పు కళాకారుల ప్రదర్శన బృందంతో, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా సభాస్థలికి చేరుకోవడం జరిగింది. అనంతరం సభ అధ్యక్షులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి వ్యవహరించగా ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిధిగా హాజరైన నల్లగొండ వరంగల్ ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పార్టీ జిల్లా నాయకత్వం ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పీడిత ప్రజలపక్షపాతి మాజీ ఎమ్మెల్యే అమరజీవి ఏసి రెడ్డి నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు సమర్పించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఏసి రెడ్డి నర్సింహ్మారెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యేక్షంగా పాల్గొని నైజాం సర్కారుకు దొరలకు ఎదురొడ్డి పోరాటం చేసిన మహోన్నత వ్యక్తని తెలిపారు. రైతాంగ సాయుధ పోరాట సమయంలో రజాకార్లు జరిపిన దాడిలో ఏసి రెడ్డి కుడి కాలు తొడలో బుల్లెట్ దిగినప్పటికీ నైజాం సైన్యాలకు ఎదురొడ్డి పోరాటం చేసిన ఉద్యమ సూర్యుడని అన్నారు. సాయుధ పోరాటం సందర్భంగా తెలంగాణ ప్రాంతంలో 10 లక్షల భూములు పంచబడ్డాయని, 4వేల మంది అమరులైనారని తెలిపారు. సాయుధ పోరాటం ఫలితంగా ప్రభుత్వం భూసంస్కరణల చట్టం తేవడం జరిగిందని అంతేకాదు దున్నేవానికి భూమి అనే నినాదం ఆచరణలోకి వచ్చిందన్నారు. ఏ.సి.రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా పనిచేసిన సందర్భంగా స్వంత ఆస్తులుగాని, భూములు సంపాదించుకోలేదన్నారు.



అలాగే పెళ్లి చేసుకుంటే పార్టీకి ఉద్యమాలకు ఆటంకమని భావించి పెళ్లి చేసుకోకుండా బ్రతికిన నిస్వార్థ నిరాడంబర వ్యక్తని తెలిపారు. ఏ.సి.రెడ్డి మరణించే నాటికి వారి ఒంటిపై డ్రెస్సుతోపాటు అధనంగా మరొక డ్రెస్సు మాత్రమే కల్గిన త్యాగశీలి అన్నారు. ఏ.సి.రెడ్డి మరణించి 32సంవత్సరాలు అయినప్పటికీ ఇంకా మనమధ్యే ఉన్నట్లుఉండని తెలిపారు.

జనగామ జిల్లాలో ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలివ్వాలని. మౌలిక సదుపాయాలు మంచినీరు కరెంటు రోడ్లు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గుడిసె వాసులపై నిర్బంధాన్ని ఆపాలని అన్నారు దేశంలో బీజేపీ ప్రభుత్వం మతం మత్తు రుద్ది ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి పాలన దాగిస్తుందని విమర్శించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ ఉన్న ఉద్యోగాలను తొలగిస్తూ పెద్ద ఎత్తున నిరుద్యోగాన్ని పెంచుతున్నారని అన్నారు బీజేపీ కులాల మధ్య మతాల మధ్య చిచ్చులు రగిలిస్తూ ప్రజా హక్కులను రాజ్యాంగం విలువలను కాలరాస్తూ భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మశాస్త్రాన్ని అమలు చేయాలని ప్రయత్నం చేస్తుందని తెలిపారు. దేశ జిడిపి గణనీయంగా పడిపోవడంతో దేశం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతుందని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు ఇళ్ల స్థలాలు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలని తెలిపారు. సిపిఎం ప్రజా సమస్యల పరిష్కారంకై రానున్న రోజుల్లో . ఏ.సి.రెడ్డి గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలలో ప్రజా పోరాటాలు ఉద్యమాలు నిర్వహించడమే ఏ.సి.రెడ్డి గారికి ఘనమైన నివాళులు అర్పించినట్లవుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, సీనియర్ నాయకులు బొట్ల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, పోత్కనూరి ఉపేందర్, బోడ నరేందర్, పొదల నాగరాజు, బెల్లంకొండ వెంకటేష్, మునిగేల రమేష్, కొడెపాక యాకయ్య, సీనియర్ నాయకులు గురిజాల లక్ష్మీ నరసింహ రెడ్డి, ఎండి దస్తగిరి, సిపిఎం మండల కార్యదర్శులు మాచర్ల సారయ్య ప్రజ్ఞపు నర్సింహులు, నాయకులు తుటి దేవదానం వెంకటమల్లయ్య, కళ్యాణం లింగం, బొడ్డు కరుణాకర్ పర్వతం నర్సింలు, మైలార వెంకటేశ్వర్లు, కాసాని పుల్లయ్య, సోమ సత్యం, మినులాపురం ఎల్లయ్య, రామగల్ల అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందీప్, ధర్మబిక్షం, వివిధ మండలాల నుండి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అమ్మా బైలెల్లినాదో.. తల్లీ బైలెల్లినాదో

- గుండ్లపోచంపల్లిలో ఘనంగా బోనాల వేడుకలు
- అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మహిళల బోనాల సమర్పణ..

✍ జయభేరి, మేడ్చల్ :



తెలంగాణ ప్రజలు తమ సంస్కృతిని ప్రతిభింబిస్తూ జరుపుకునే పండుగల్లో బోనాల పండుగకు ప్రత్యేక విశిష్టత ఉందని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో జరిగిన ఆషాడ మసా బోనాల వేడుకలో శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆషాడ మాసాంలో గ్రామ దేవతలకు మహిళలు నైవేద్యంగా బోనం సమర్పస్తూ మొక్కులు చెల్లించుకునే ఆనవాయితి తెలంగాణా సంస్కృతిలో వందల సంవత్సరాల నుండి వస్తుందన్నారు. ఈ ఏడూ ఎటువంటి ప్రకృతి విపత్తు రాకుండా ప్రజలపై అమ్మవారు చల్లని చూపు చూపాలని, వర్షాలు సంవృద్దిగా కురిసి పడిపంటలతో సుఖశాంతులతో ప్రజలు జీవించే విధంగా అమ్మవారు దివించాలని కోరుకునట్లు మద్దుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భేరి బాలరాజు, అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి, నాయకులు సురేందర్ గౌడ్, నర్సింగరావు, సురేష్, హరిబాబు, రమేష్, మహేష్, లక్ష్మణ్, ప్రభాకర్, కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ మున్సిపాలిటీ పరిదిలోని ఎస్సి కాలనీలో ఆదివారం జరిగిన బోనాల పండుగ అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. కాలనీలోని మహిళలంతా ఒక్కటై బోనాలను ఎత్తుకొని పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవార్లకు బోనాలు నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు.

# సోమేష్ కుమార్ అరెస్ట్ పై ఉదంతాలు

✍ జయభేరి, హైదరాబాద్, జూలై 29:

తెలంగాణలో కమర్షియల్ ట్యాక్స్ స్కామ్‌లో రాష్ట్ర సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సీసీఎస్‌లో కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ రవి కనూరి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశారు. రూ.1400 కోట్ల కుంభకోణం జరిగినట్లుగా భావిస్తున్నారు. అయితే, ఈ వ్యవహారంపై అసెంబ్లీలో చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ కూడా ఈ కుంభకోణంలో చిక్కుకున్నారు. ఏ 5 నిందితుడిగా సోమేశ్ కుమార్ పేరును సీసీఎస్ పోలీసులు చేర్చారు. మాజీ సీఎస్‌తో పాటు వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ విశ్వేశ్వర్ రావు, డిప్యూటీ కమిషనర్ ఎ.శివరామ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్ బాబుపై కేసు నమోదు చేశారు.ఈ వ్యవహారంపై సీసీఎస్ పోలీసులు ఇప్పటికే ఆధారాలను సేకరించగా.. దాదాపు 75 మంది ట్యాక్సులు చెల్లింపుదారులు కార్యకలాపాల వివరాలను నిందితులు ఉద్దేశపూర్వకంగా ఆన్‌లైన్‌లో కనిపించకుండా చేసినట్లు



తెలిసింది. పన్ను ఎగవేతకు నిందితులు బాగా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. కమర్షియల్ ట్యాక్స్, హైదరాబాద్ ఐఐటీ మధ్య జరిగిన లావాదేవీలను కూడా పక్కదారి పట్టినట్లుగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ ఐఐటీకి చెందిన సాఫ్ట్‌వేర్‌లోని సమాచారాన్ని స్పెషల్ ఇనిషియేటివ్ వాట్సప్ గ్రూప్‌కు చేరేలా ఆదేశాలు అందాయని.. ఆ గ్రూప్‌లో మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ కూడా ఉన్నట్లు గుర్తించారు.




## కరీంనగర్ ప్రజలను సల్లగా చూడలి తల్లి

- శ్రీశ్రీశ్రీ ముత్యాల పోచమ్మ తల్లి పద్మనగర్ అమ్మ వారి ఆలయాన్ని ఆశాడ మాసంలో దర్శించుకోవాలని అతిథులను ఆహ్వానించడం జరిగినది.

✍ జయభేరి, కరీంనగర్ :

కరీంనగర్ అసంబ్లీ నియోజకవర్గం ఇంచార్జి కాంగ్రెస్ పార్టీ పురుమల్ల శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు ఇద్దరు అమ్మ వారిని దర్శనం చేసుకొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం పోచమ్మ పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోచమ్మ తల్లి అమ్మవారు కరీంనగర్ ప్రజలను సల్లగా చూడలని కోరుకుంటూ, దేవాలయానికి నావంతు కృషి చేస్తానని తెలిపినారు. వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరు అమ్మ వారి దయతో ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలిని, అమ్మ వారి దయ ప్రజలందరి మీద ఉండాలని కోరుతున్నానని తెలియజేసినారు. వీరిద్దరిని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమములో జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు గడ్డం శ్రీరాములు, జిల్లా కాంగ్రేస్ పార్టీ ఉపాధ్యక్షులు మడుపు మోహన్, జిల్లా కాంగ్రేస్ పార్టీ BC సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ బోనాల మురళి, ఆలయ కమిటీ సభ్యులు మోర రాజేశం, మచ్చ హరిదాస్, బైరి సత్యానందం, వెల్దండి మురళి, సొల్లేటి సుభాష్, జిట్టవేణి పర్శరాములు, బైరి సంపత్ కుమార్, తోట శ్రీనివాస్, శ్రీపతి కిషోర్, ఆలయ పూజారి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.





# మరో పతకం పై గురి.. మను

- 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ కాంస్య పోరుకు అర్హత

**పారిస్:**

ఒలింపిక్స్ తాజా ఎడిషన్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన షూటర్ మను భాకర్ మరో కాంస్యంపై గురిపెట్టింది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్ ఈవెంట్‌లో మను, సరబ్‌జ్యోత్ సింగ్ ద్వయం మూడో స్థానంలో నిలిచి క్వార్టర్స్ పోరుకు అర్హత సాధించింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో మను, సరబ్‌జ్యోత్ జోడీ.. 580 (20 షాట్లలో) పాయింట్లు స్కోరు చేసి పతక రేసులోకి వచ్చింది. నాలుగో స్థానంలో నిలిచిన దక్షిణ కొరియా (579 పాయింట్లు)తో క్వార్టర్స్‌లో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. 18 షాట్లలో 582 పాయింట్లు స్కోరు చేసిన టర్కీ అగ్రస్థానంలో నిలవగా 24 షాట్లలో 581 పాయింట్లు సాధించిన సెర్బియా స్వర్ణ, రజత పోరు కోసం తలపడతాయి. ఇదే ఈవెంట్ లో బరిలో నిలిచిన మరో భారత ద్వయం రిథమ్ సంగ్వాన్, అర్జున్ సింగ్ పదో స్థానంతో పతక రేసు నుంచి నిష్క్రమించారు. మంగళవారం జరిగే మెడల్ ఈవెంట్ లో గనక పతకం గెలిస్తే మను భాకర్ చరిత్ర సృష్టించినట్టే. భారత ఒలింపిక్ చరిత్రలో ఇప్పటిదాకా రెండు పతకాలు గెలిచినవారిలో సుశీల్ కుమార్ (రెజ్లర్), పీవీ సింధు (బ్యాడ్మింటన్)మాత్రమే ఉండగా వాళ్లిద్దరూ వేర్వేరు ఎడిషన్లలో మెడల్స్ కొట్టారు. ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు సాధించిన క్రీడాకారులైతే ఎవరూ లేరు. 1900లో నార్మన్ ప్రిచర్డ్ భారత్ తరఫున ఆడుతూ ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గినా ఆయన బ్రిటన్ దేశస్థుడు. మరి మన మను ఏం చేసేనో!

# ఏమవుతుందో తెలుసా?




- వారానికి ఒకసారి శృంగారంలో పాల్గొనడం వల్ల ఆయుష్షు పెరుగుతుందా? వాస్తవాలు తెల్సుకోండి.
- మహిళల్లో శృంగారం మీద కోరిక క్రమంగా తగ్గపోతుంది. కొంతమంది లైంగిక సంబంధానికి పూర్తిగా దూరంగా ఉండిపోతారు. కానీ మీ ఆయుష్షుకు, శృంగారానికి సంబంధం ఉంటే నమ్ముతారా?

తాజా సర్వే చెబుతుందిదే. జర్నల్ ఆఫ్ సైకోలాజికల్ హెల్త్ ప్రచురించిన కథనం ప్రకారం శృంగారంలో ఎన్నిసార్లు పాల్గొన్నారనే విషయానికి, మరణ రేటుకు సంబంధం ఉందని తేలింది. 2005 నుంచి 2010 దాకా నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రీషన్ ఎగ్జామినేషన్ సర్వే (NHANES) వివరాల ఆధారంగా ఈ విషయం తేల్చారు. కనీసం వారానికి ఒకసారైనా శృంగారంలో పాల్గొనని మహిళల్లో మరణ రేటు అవకాశం పెరుగుతుందట. వారానికి ఒకసారైనా సెక్స్ లో పాల్గొనేవాళ్లలో ఈ రేటు తక్కువగా ఉంది.

**మ్యాజిక్ నంబర్ 7:**
ఈ సర్వే ప్రకారం ఏడో అంకె ఒక మ్యాజిక్ నంబర్. ఏడు రోజులకు లేదా వారానికి ఒకసారి శృంగారంలో పాల్గొనడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. పూర్తి ఆరోగ్యం మెరుగుపడుతుంది. వారానికి ఒకటి కంటే ఎక్కువసార్లు సెక్స్ చేయడం వల్ల అదనపు ప్రయోజనాలు లేనప్పటికీ, శృంగారానికి దూరంగా ఉండలం వల్ల దీర్ఘకాలంలో ప్రభావం ఉంటుంది.

**ఆరోగ్య ప్రయోజనాలు:**
శృంగారం వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు, ఆక్సిటోసిన్ విడుదలవుతాయి. ఇవి మూడ్ మెరుగుపరుస్తాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గిస్తాయి. తరచూ శృంగారంలో పాల్గొనడం వల్ల వీటి ఉత్పత్తి పెరగుతుంది. రోగనిరోధక శక్తి బలపడుతుంది. ఇన్ఫెక్షన్లు, అనారోగ్యాల బారిన పడకుండా ఉండగలరు. ముఖ్యంగా ఎండార్ఫిన్లు విడుదలవ్వడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్త సరఫరా పెరుగుతుంది. ప్రొలాక్టిన్ అనే హార్మోన్ విడుదలవ్వడం వల్ల నిద్ర నాణ్యత పెరుగుతుంది.

**డిప్రెషన్ తగ్గుతుంది:**
శృంగారంలో ఎక్కువ సార్లు పాల్గొనే వారిలో నిరాశ, డిప్రెషన్ తక్కువగా ఉంటాయని నివేదిక చెబుతుంది. తక్కువ సార్లు శృంగారం పాల్గొని, డిప్రెషన్ లో ఉన్న మహిళల్లో అకాల మరణ రేటు అవకాశం 197 శాతం ఎక్కువుంది. ఈ సర్వే కేవలం మహిళలను ఉద్దేశించి చేసింది. కాబట్టి పురుషుల్లోనూ ఇదే ప్రభావం ఉంటుందని చెప్పలేము. మానసిక ఆందోళనలకు, ఇబ్బందులకు సెక్స్ అనేది థెరపీగా పనిచేయదు. ఏ చికిత్సకు సెక్స్ అనేది భర్తీ చేయదు. సెక్స్ వల్ల విపరీతమైన శారీరక, మానసిక లాభాలు లేకపోవచ్చు. కానీ ఈ నివేదిక ప్రకారం శృంగార రేటుకు, అకాల మరణానికి ఉన్న సంబంధం మాత్రం ప్రమాద సూచికగా గమనించుకోవాలి. ఏ పనైనా వ్యసనంలాగా మార్చుకున్నా, దాని జోలికే పోకపోయినా ప్రమాదమే. జీవితానికి కావాల్సింది అందుకుంటే చాలు. మీకు సరైందేదో తెల్సుకుంటే చాలు.



# ఎలాంటి ప్యాంటీలను ఎంచుకోవాలి?

మహిళలు అండర్‌వేర్ కొనేటప్పుడు ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి, ఇవి చాలా ముఖ్యం

మహిళలకు లోదుస్తులు చాలా ముఖ్యమైనవి. యోని ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి , పరిశుభ్రతను పాటించడానికి నాణ్యమైన ప్యాంటీలను ఎంచుకోవాలి. ఇన్నర్ వేర్ ఎంచుకోవడానికి కొన్ని అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

బ్యూటీ ప్రొడక్ట్స్ నుంచి డిజైనర్ దుస్తుల వరకు మహిళలు ప్రతి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ లోదుస్తులు కొనుగోలు చేసే విషయంలో మాత్రం కాస్త నిర్లక్ష్యంగా ఉంటారు. ఏవో ఒకటి కొనేసుకుంటారు. మరికొందరు వాటికి డబ్బులు ఖర్చుపెట్టడం ఇష్టంలేక కొనరు. కొంతమంది ప్యాంటీలు షాపుల్లో అడిగేందుకుసిగ్గుపడుతుంటారు. ఇలా ఎన్నో కారణాల వల్ల ప్యాంటీలు కొనే విషయంలో అశ్రద్ధ వహిస్తారు. కారణం ఏదైనప్పటికీ, నాణ్యతలేని లోదుస్తులను ఎంచుకోవడం వారి ఆరోగ్యానికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది.

**ప్యాంటీ కచ్చితంగా వేసుకోవాల్సిందేనా?**
చాలా మంది మహిళలు ప్యాంటీలు వేసుకోవడానికి ఇష్టపడరు. వేసుకున్నా నాసిరకంవి ఎంచుకుంటారు. వాటికి ఎక్కువ ఖర్చుపెట్టేందుకు ఇష్టపడరు. అధ్యయనాలు చెబుతున్నప్రకారం మహిళలు లోదుస్తులు ధరించకపోతే యోని ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. నాణ్యతలేని లోదుస్తులు ధరించడం కూడా రోజువారీ జీవనశైలి, మానసిక స్థితిపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. అటువంటి పరిస్థితిలో, మహిళలు తమ కోసం ప్యాంటీలను ఎంచుకునేటప్పుడు ఎటువంటి ప్రత్యేక విషయాలను దృష్టిలో ఉంచుకోవాలో తెలుసుకుందాం.

**సరైన ఫ్యాబ్రిక్**
లోదుస్తులు కొనుగోలు చేసేటప్పుడు, మొదట దాని ఫ్యాబ్రిక్ పై దృష్టి పెట్టండి. యోని అనేది మహిళల శరీరంలో చాలా సున్నితమైన భాగం. దీని కోసం ఎల్లప్పుడూ కాటన్ తో తయారు చేసిన వస్త్రాన్ని ఉపయోగించండి. కాటన్ దుస్తులు చెమటను గ్రహించడంలో ఉత్తమమైనవి. ఈ కారణంగా అవి చర్మానికి మంచివి. దీని వల్ల మహిళలు ఇన్ఫెక్షన్ బారిన పడకుండా కాపాడుతున్నారు. నైలాన్ వంటి సింథటిక్ ఫ్యాబ్రిక్ తో చేసిన లోదుస్తులు కొన్నిసార్లు దురద, అధిక చెమటకు కారణమవుతాయి. కాబట్టి అలాంటివి ఎంచుకోకూడదు. వీలైనంత వరకు సున్నితంగా, కాటన్ తో కుట్టిన ప్యాటీలు ఎంచుకోవడం మంచిది.

**ఫ్యాషనబుల్ లోదుస్తులు**
చాలా సార్లు మహిళలు ఫ్యాషనబుల్, స్టైలిష్ లోదుస్తుల కోసం లేస్, బటన్డ్ లోదుస్తులు కొనుగోలు చేస్తుంటారు. కానీ ఇలాంటి లోదుస్తులు యోని చుట్టూ ఎర్రదనం, దద్దుర్లు కలిగిస్తాయి. అటువంటి పరిస్థితిలో, ఎల్లప్పుడూ సాధారణ కాటన్ ఫ్యాబ్రిక్ తో తయారు చేసిన లోదుస్తులను కొనండి. లోదుస్తులు కొనుగోలు చేసేటప్పుడు, దాని నాణ్యతపై శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. మంచి నాణ్యమైన లోదుస్తులు ధరించకపోవడం మీ యోని ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. ఇది కాకుండా, మీకు ఫిట్ అయ్యే లోదుస్తులను కొనుగోలు చేయండి. వేసవి కాలం, శీతాకాలం అయినా, ప్రతిరోజూ లోదుస్తులను మార్చడం చాలా ముఖ్యం. ఒకే ప్యాంటీని చాలా రోజులు ధరించడం వల్ల యోని ఆరోగ్యం దెబ్బతింటుంది. ఒకసారి లోదుస్తులు ధరిస్తే చెమట, మలం, మూత్ర కణాలు అంటుకుంటాయి. మళ్లీ ధరించినప్పుడు అవి యోనికి అతుక్కుని అనే ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**లోదుస్తులను ఉతకడం**
మీరు కాటన్‌తో చేసిన లోదుస్తులను ఉపయోగిస్తే వాటిని ఉతికేటప్పుడు మీరు బ్లీచ్ ఉపయోగించవచ్చు. ఇలా చేయడం వల్ల దానిపై ఉండే క్రిములు తొలగిపోతాయి. రంగురంగుల లోదుస్తులను క్రిమిసంహారక చేయడానికి గోరువెచ్చని నీరు, డిటర్జెంట్ ఉపయోగించండి. ఇలా చేయడం వల్ల యోనిలో ఇన్ఫెక్షన్లు, ఇతర సమస్యలను దూరం చేసుకోవచ్చు.

**కాటన్ లోదుస్తులు**
శరీరం నుండి బయటకు వచ్చే చెమటలో బ్యాక్టీరియా దాగి ఉంటుంది. ఇది చర్మంపై ఎక్కువసేపు ఉండటం ద్వారా శరీరంలో దురద, చికాకు కలిగిస్తుంది. అటువంటి పరిస్థితిలో, మీ యోని ఆరోగ్యం, పరిశుభ్రతను కాపాడుకోవడానికి ఎల్లప్పుడూ చెమటను గ్రహించే కాటన్ లోదుస్తులను ధరించండి.



# మూవీభేరి



## నాకే ఎందుకిలా అయితాందిర భాయ్..

రామ్ పోతినేని, పూరీజగన్నాథ్‌ల 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఆగస్ట్ 15న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర అవుతున్న కొద్దీ ప్రమోషన్స్‌ని చిత్రబృందం వేగవంతం చేసింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రచార చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తున్నదని, ఇప్పటివరకూ విడుదలైన రెండు పాటలు ఆడియన్స్‌ని అలరిస్తున్నాయని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా సోమవారం ఈ సినిమాకు చెందిన మూడో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'క్యా లఫ్డా.. క్యా లఫ్డా.. క్యా లఫ్డా హే.. వై రబ్బా.. వై రబ్బా.. వై రబ్బా వై.. నాకే ఎందుకిలా అయితాందిరా భాయ్..' అంటూ సాగే ఈ పాటను శ్రీహర్ష ఈమని రాయగా, మణిశర్మ స్వరపరిచారు. ధనుంజయ్ సీపాన, సింధూజ ఆలపించారు. మోస్ట్ రొమాంటిగ్గా, ట్రెండీగా ఈ పాటను పూరీ తెరకెక్కించినట్టు పాట చూస్తే అర్థమవుతుంది. కావ్యా థాపర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సంజయ్‌దత్ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. సామ్ కె.నాయుడు, జియాని జియాన్నెలి ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ పతాకంపై పూరీజగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మించారు.



## కావ్యం లాంటి సినిమా

'ఇందులో నా పాత్ర పేరు ధరణి. చాలా హైపర్‌గా అల్లరిగా ఉంటా. ప్రతి అమ్మాయి తనకు తాను రిలేట్ చేసుకునేలా నా పాత్ర ఉంటుంది. చాలా బ్యూటిఫుల్ క్యారెక్టరైజేషన్. ఇదొక అందమైన కావ్యం లాంటి సినిమా. అద్భుతమైన స్క్రిప్ట్. మంచి సినిమా చేశానని సంతృప్తిగా ఉంది' అని కథానాయిక మోక్ష ఆనందం వ్యక్తం చేసింది. యువహీరో కృష్ణవంశీకి జోడీగా ఆమె నటించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఆగస్ట్ 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మోక్ష సోమవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఈ పాత్ర కోసం చాలా హార్డ్ వర్క్ చేశా. సెకండాఫ్ అంతా మనాలీలో సాగుతుంది. చలికాలం మైనస్ డిగ్రీలలో షూట్ చేశాం. ఈ కథలో నేచర్ ఫిలాసఫీ ఉంది. దాన్ని క్యాప్చర్ చేయడం సవాల్‌తో కూడుకున్న విషయం. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు ఈ పాత్ర నాకోసమే పుట్టిందనిపించింది. ఆయన విజన్ ఉన్న దర్శకుడు. చాలా హానెస్ట్‌గా తీశారు. అమలాపురం, వైజాగ్‌లో కొంత భాగం షూటింగ్ చేశాం. అక్కడి జనం నన్ను సొంత కూతురిలా చూసుకున్నారు. సంగీత పరంగా, సాహిత్య పరంగా, టేకింగ్ పరంగా కొత్త అనుభూతిని పంచే సినిమా ఇది. అందరికీ నచ్చుతుంది' అంటూ నమ్మకం వ్యక్తం చేసింది మోక్ష.

## అన్ని వయసులవారికీ కనెక్టయ్యే కాన్సెప్ట్

'ప్రతి మనిషి జీవితంలో జరిగే కథ ఇది. ఈ సినిమాలోని చాలా సీన్స్ నా జీవితంలో జరిగినవే. ఓ కుటుంబంలా అందరం కష్టపడి ఈ సినిమాకు పనిచేశాం. కథను నమ్మి డబ్బు పెట్టిన నిర్మాతలకు సెల్యూట్ చెయ్యాలి. దర్శకుడు శివ సినిమాను అద్భుతంగా మలిచాడు.' అని నటుడు అజయ్‌ఘోష్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'మ్యూజిక్‌షాప్ మూర్తి'. చాందిని చౌదరి కీలకపాత్ర పోషించింది. శివ పాలడుగు దర్శకుడు. హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మాతలు. జూన్ 14న థియేటర్లలో విడుదలై విమర్శకుల ప్రశంసలందుకున్న ఈ చిత్రం ఓటీటీలో కూడా ప్రజాదరణ పొందుతున్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్రబృదం మాట్లాడారు. అన్ని వయసులవారికీ కనెక్టయ్యే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం త్వరలో మిగతా భాషల్లో కూడా రాబోతున్నదని నటి చాందినీ చౌదరి చెప్పారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన దర్శక,నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చిత్ర యూనిట్‌ను అభినందించారు.

## రాజా సాబ్ వింటేజ్ లుక్



పాన్‌ఇండియా స్టార్ ప్రభాస్ చేస్తున్న సినిమాల సినేరియానే భిన్నంగా ఉంటున్నాయి. హాలీవుడ్‌ని తలపించే సినిమాలు చేస్తున్నారాయన. ఇప్పటివరకూ వచ్చిన సినిమాలన్నీ దాదాపు అలాంటివే. ప్రస్తుతానికి ఆ విధానానికి కాస్త కామా పెట్టి, ఆయన చేస్తున్న పూర్తి స్థాయి తెలుగు సినిమా 'రాజా సాబ్'. ఇది ఫక్త్ టాలీవుడ్ మార్క్ ఎంటర్‌టైనర్ అని చెప్పాలి. పైగా తన ఇమేజ్‌కి భిన్నంగా రొమాంటిక్ హారర్ కామెడీ కథలో ప్రభాస్ నటించడం మరో విశేషం. పీపుల్ మీడియా ఫ్యాక్టర్ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు మారుతి. విడుదలకు ముందే ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న పాన్‌ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏడాది ముందు నుంచే మేకర్స్ ప్రమోషన్స్ షురూ చేశారు. సోమవారం ఈసినిమా గ్లింప్స్‌ని విడుదల చేశారు. ప్రభాస్ వింటేజ్ లుక్ ఈ గ్లింప్‌కే కొత్త అందాన్ని తెచ్చిందని మేకర్స్ అంటున్నారు. ఈ సినిమా షూటింగ్ 40శాతం పూర్తయిందని, ప్రభాస్ ఫ్యాన్స్‌కు ఎప్పటికీ గుర్తుండిపోయే తీపి జ్ఞాపకంగా ఈసినిమా నిలుస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com